కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో కలపాలి

- ఎన్నికల కోసం మేనిఫెస్టో తేలేదు
- ఆపదమొక్కులు మొక్కేవారిని నమ్మవద్దు
- మంచి చెడులు ఆలోచించి ఓటు వేయాలి
- జనగామ, భువనగిరి సభల్లో సిఎం కెసిఆర్


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతులకు మేలు చేసేందుకు తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌ను తీసేసి బంగాళాఖాతంలో వేస్తామంటున్న కాంగ్రెస్ పార్టీనే బంగాళాఖాతంలో కలపాలని సిఎం కెసిఆర్ అన్నారు. ఎన్నికల సమయంలో ఆపద మొక్కులు మొక్కేవారిని నమ్మవద్దని, ఆలోచించి ఓటు వేయాలని ప్రజలను కోరారు. బిఆర్ఎస్ మళ్లీ గెలిస్తే.. 93 లక్షల మందికి కెసిఆర్ బీమా అమలు చేస్తామన్నారు. రైతుబీమా తరహాలోనే వ్యక్తి చనిపోతే వారంలోనే రూ.ఐదు లక్షలు వస్తాయి. మళ్లీ గెలవగానే రేషన్ కార్డు దారులకు సన్నబియ్యం ఇస్తామని కెసిఆర్ పునరుద్ఘాటించారు. సోమవారం జనగామ, భువనగిరి పట్టణాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో కెసిఆర్ మాట్లాడారు.

జనగామ బిఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తే.. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తామని కెసిఆర్ హామీ ఇచ్చారు. జనగామ జిల్లాలో మెడికల్ కాలేజీతో పాటు నర్సింగ్, పారామెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తామన్నారు. తెలంగాణ ఏర్పాటు కాకముందు కొన్ని జిల్లాలకు వెళ్తే ఏడుపొచ్చేదని, జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల పరిస్థితి చూస్తే బాధనిపించేదని చెప్పారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు సమీపంలో ఉన్నందున భవిష్యత్‌లో జనగామ అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. ఉద్యమ సమయంలో బచ్చన్నపేటకు వెళ్తే ఊరిలో ఒక్క యువకుడు కనిపించలేదు. ఊరిలో యువకులంతా పొట్ట చేతబట్టుకొని వలస వెళ్లారని తెలిసింది. ఇప్పుడు అదే బచ్చన్నపేటలో 365 రోజులు నీళ్లు ఉంటున్నాయని చెప్పారు. కొత్త జిల్లాల ఏర్పాటులో ఎన్నో అంశాలు పరిగణనలోకి తీసుకున్నామన్నారు. 'రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో మనది అగమ్య గోచర పరిస్థితి. ఆర్థిక నిపుణులను పిలిపించి రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళికలు రచించా. ఎంతో మేథోమధనం చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టించాం. ఇవాళ తెలంగాణ నుంచి రెండు నెలలపాటు వేలాది లారీల్లో ధాన్యం పంట తరలివెళ్తోంది. తెలంగాణ రైతులు ఇప్పుడిప్పుడే దారినపడ్డారు. రైతులకు తమ భూమిపై పూర్తి హక్కులు ఉండాలని ధరణి తెచ్చాం. రైతుల కష్టాలు తెలుసు కాబట్టి రెవెన్యూ అధికారుల అధికారాలను రైతు చేతిలో పెట్టాను. రైతు వేలిముద్ర లేకుండా భూమి జోలికి ఎవరూ పోలేరు" అని కెసిఆర్ అన్నారు.

"ఓటు మన తలరాతను మార్చేస్తుంది. రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ప్రజాస్వామ్యంలో ఎంతో బలమైన ఆయుధం మన ఓటు. ఓటును ఎలా వేస్తామో.. మన కర్మ అలానే ఉంటుంది. మంచి, చెడు గుర్తించి ప్రజలు ఓటేయాలి. అలా చేస్తేనే మంచి ఫలితాలు వస్తాయి. ఎన్నికలప్పుడు వచ్చి ఆపద మొక్కులు మొక్కేవారిని నమ్మొద్దు" అని చెప్పారు. రాష్ట్రంలో పరిస్థితులు బాగున్నందువల్లే భారీగా పెట్టుబడులు వస్తున్నాయన్నారు. మత కలహాలు లేకుండా శాంతిభద్రతలు బాగున్నాయని, కొందరు వచ్చి మతం పేరుతో విభేదాలు సృష్టించాలని చూస్తున్నారని తెలిపారు. తెలంగాణలో హిందూ, ముస్లిముల మధ్య సోదరభావం ఉందన్నారు. గణేశ్ నిమజ్జనం రోజే మిలాద్ ఉన్ నబీ వస్తే.. ఎవరూ అడగ కుండానే ముస్లిం మత పెద్దలు ఆ వేడుకను ఒక రోజు వాయిదా వేసుకున్నారని కెసిఆర్ పేర్కొన్నారు. ఓట్ల కోసం మేం అబద్ధాల మేనిఫెస్టో పెట్టలేదన్నారు. దేశంలో దళితబంధు పెట్టాలనే ఆలోచన ఏ సిఎంకు అయినా వచ్చిందా? అని ప్రశ్నించారు. దేశంలో దశాబ్దాల క్రితమే దళితబంధు పెట్టి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి ఉండేది కాదని వ్యాఖ్యానించారు. ఒకప్పుడు కరువు ప్రాంతమైన భువనగిరిలో ఇప్పుడు పుష్కలంగా పంటలు పండుతున్నాయని సిఎం కెసిఆర్ అన్నారు. భువననిగిలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కెసిఆర్ ప్రసంగించారు. తెలంగాణ రాకుండా ఉంటే భువనగిరి జిల్లా అయి ఉండేది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం భువనగిరిలో అరాచక శక్తులను పెంచి పోషించిందని విమర్శించారు. ధరణి తీసుకొచ్చి అధికారుల పెత్తనం తీసేసి భూమిపై రైతులకే అధికారం ఇచ్చామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే. కౌలు రైతులు, విఆర్వోల బెడద మళ్లీ మొదలు అవుతుందన్నారు. ధరణి తీసివేస్తే పెద్ద ప్రమాదం పొంచి ఉంది. మండల కేంద్రంలో 10 నమిషాల్లోనే రిజిస్ట్రేషన్ జరిగేలా ఏర్పాట్లు చేశాం. కాంగ్రెస్ వస్తే.. ధరణి పోయి మళ్లీ దళా రుల రాజ్యం వస్తుందని చెప్పారు.. భువనగిరిలో ఐటీ హబ్ తీసుకురావాలని కేటీఆర్‌కు చెప్పా. బిఆర్ఎస్ మళ్లీ గెలిస్తే భువనగిరలో ఐటీ పార్కులు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.బిఆర్ఎస్‌ని మరోసారి గెలిపిస్తే 24 గంటల పాటు కరెంటును అలాగే కొనసాగించుకుందాం.. బ్రహ్మాండంగా ముందుకు సాగుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం" అని కెసిఆర్ తెలిపారు.

మూడోసారి సిఎం.. కెసిఆరే

- ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టో చాలా బాగుందని ఎంఐఎం పార్టీ అధ్యక్షులు, ఎంపి అసదుద్దీన్ ఒవైసి అన్నారు. ఈ మేనిఫెస్టోతో కెసిఆర్ మూడోసారి సిఎం కావడం ఖాయమని చెప్పారు. రూ.400కే సిలిండర్ ఇస్తామన్న ఆయన నిర్ణయం చాలా బాగుందని కితాబిచ్చారు. మైనార్టీలకు బడ్జెట్ పెంచుతామనడం హర్షణీయమన్నారు. ఎంఐఎం పోటీ చేయని చోట బిఆర్ఎస్‌కు మద్దతిస్తున్నట్లు తెలిపారు. ప్రచారం కోసం రాష్ట్రానికి కాంగ్రెస్ అగ్రనేతలు వస్తారని, రాష్ట్రంలో అభివృద్ధి చూసి వాళ్ల కళ్లు తెరచుకుంటాయని అసదుద్దీన్ వ్యాఖ్యానించారు.

జూనియర్ కాలేజీలకు దసరా సెలవులు పెంచాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూనియర్ కాలేజీలకు దసరా సెలవులను పెంచాలని మైనార్టీ గెజిటెడ్ లెక్చరర్ల ఫోరం అధ్యక్షులు సయ్యద్ జబీ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వారం రోజులే సెలవులు ఇవ్వడంతో బతుకమ్మ సంబరాలు కుటుంబ సభ్యులతో కలిసి జరపలేకపోతున్నామంటూ విద్యార్థులు వారి తల్లిదండ్రులకు చెప్తున్నారని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలకు దసరా సెలవులు 13 రోజులిచ్చారని పేర్కొన్నారు. జూనియర్ కాలేజీలకూ ఈ సెలవులను పెంచాలని కోరారు.

రేవంత్ రెడ్డిని తొలగించాలి

- డాక్టర్ విజయ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గద్వాల టికెట్ ను రూ.పది కోట్లు, ఐదెకరాల భూమికి అమ్ముకున్న టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని ఆ పదవి నుంచి తొలగించాలని పిసిసి కార్యదర్శి డాక్టర్ కురువ విజయ్ కుమార్ ఆ పార్టీ హైకమాండ్‌ను డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గన్‌పార్కు అమరవీరుల స్థూపం వద్ద ఆందోళనకు దిగారు. 65 సీట్లను రూ.600 కోట్లకు రేవంత్ రెడ్డి అమ్ముకున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డిపై ఇడి, ఎలక్షన్ కమిషన్లకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. రేవంత్ రెడ్డి అనుచరులు తనను బెదిరిస్తున్నారని, రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు.

300 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు అరెస్ట్, పరారీలో ముగ్గురు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంధ్రప్రదేశ్ నుంచి మహారాష్ట్రకు గంజాయి అక్రమ రవాణా పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠాలోని ఇద్దరిని టాస్క్‌ఫోర్స్, ఎల్కతుర్తి పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. అరెస్టయన వారి నుంచి రూ.75 లక్షల విలువగల 300 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మధ్యప్రదేశ్‌లోని వూన్, కార్గావ్ జిల్లాకు చెందిన కోలి రాజా వర్మ, మహారాష్ట్ర జల్‌గావ్ జిల్లా అకుల్‌దేడకు చెందిన పార్టిల్ నామ్‌దేవ్‌ని అరెస్టు చేశారు. ముఠా సభ్యుల్లోని మరో ముగ్గురు రాహుల్ సబులే, శుభం గోతీరామ్ సబులే, శేషుకుమార్ పరారీలో ఉన్నారు. వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ వెల్లడించారు. సులభంగా డబ్బు సంపాధించాలనే ఆలోచనతో నిందితులిద్దరూ ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో 300 కిలోల గంజాయిని కొనుగోలు చేసి దాన్ని రెండుకిలోల ప్యాకెట్ల రూపంలో తయారు చేసి డిసిఎం వ్యాన్‌లో తరలించేందుకు సిద్ధం చేశారు. ఈ క్రమంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందడంతో ఎల్కతుర్తి మండలం పెంచికలపేట వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్

ఆడబిడ్డ చనిపోతే ఆరోపణలా?

కెటిఆర్‌ను నిలదీసిన రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఆడ బిడ్డ ఆత్మహత్య చేసుకుంటే అవమానిస్తూ.. ఏ పరీక్ష రాయలేదంటావా.. ఆది నీకు తగునా, మీ చెల్లినో మీ కాక బిడ్డనో చనిపోతే ఇలానే మాట్లాడతారా..' అంటూ గ్రూపు-2 అభ్యర్థి ప్రవళిక ఆత్మహత్యపై కెటిఆర్‌ను టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి నిలదీశారు.



డిసెంబర్ నెలలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తోందని, ఆరు పథకాలను తప్పకుండా అమలు చేస్తామని, డిసెంబర్ 9వ తేదీన తొలి సంతకం దానిపైనే చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో రేవంత్ మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజలకు సాగునీరు అందించేందుకు కాంగ్రెస్ చేవేళ్ల ప్రాణహిత ప్రాజెక్టును ప్రారంభించిందని గుర్తు చేశారు. కానీ కెసిఆర్ పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా నీళ్ళు తెస్తానని చెప్పి నేటికీ తేలేదన్నారు. వికారాబాద్ వరకు ఎంఎంటిఎస్ తెచ్చేందుకు జైపాల్ రెడ్డి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. దానికి కెసిఆర్ అడ్డుపడటంతోనే రాలేదని తెలిపారు.

పవిత్రంగా బిఆర్ఎస్ మ్యానిఫెస్టో

- ఇప్పుడు మాకోసం పనిచేయండి.. ఐదేళ్లు మీకోసం చేస్తాం
- కార్యకర్తలతో మంత్రి కెటిఆర్
- సిరిసిల్లలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం


కార్యక్రమంలో మాట్లాడుతున్న కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భగవద్గీత, బైబిల్, కూరాన్‌లాగా బిఆర్ఎస్ మ్యానిఫెస్టో పవిత్రంగా ఉందని పురపాలక శాఖ మంత్రి కె తారక రామారావు అన్నారు. సిరిసిల్లలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని సోమవారం కెటిఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 90 నుంచి 95 సీట్లు గెలిస్తేనే మనకు ముఖం తెలివి ఉంటుందని, ఈ 45 రోజులు ప్రతి ఒక్క కార్యకర్త మాకోసం పనిచేయాలని, ఆ తర్వాత ఐదేళ్లు మీకోసం పనిచేస్తామని అన్నారు. కలెక్టరేట్‌లోని ప్రజావాణిలాగా పార్టీ జిల్లా కార్యాలయంలోనూ ప్రతివారం దరఖాస్తులు తీసుకొని సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ఈ భవనంలోనే మీడియా సెంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. బిఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ భవన్ ఏర్పాటు చేస్తామని, వ్యక్తులు శాశ్వతం కాదని వ్యవస్థ శాశ్వతం కావాలన్నారు. నాయకులు ఒకరికొకరు పంతాలకు వెళ్లకుండా పార్టీ గెలుపు కోసం పని చేయాలని కోరారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతున్న తీరు చాలా విడ్డూరంగా ఉందని, కాంగ్రెస్ పథకాలను తాము కాపీ కొట్టామనడం సిగ్గుచేటన్నారు. ఎవరి పథకాలను ఎవరు కాపీ కొట్టారో ప్రజలకు తెలుసన్నారు. సిఎం కెసిఆర్ పథకాలను దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీనే కాపీ కొట్టారన్నారు. కెసిఆర్ ఏది చెప్పినా అది ఎంత కష్టమైనా చేసి చూపిస్తారన్నారు.

ఢీకొట్టేవారికే..

- రెండవ విడత అభ్యర్థుల జాబితాపై కాంగ్రెస్ కసరత్తు
- అధికార పార్టీ అభ్యర్థికి దీటైన వ్యక్తుల కోసం వేట
- ఆయోమయంలో ఆశావహులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలని భావిస్తున్న కాంగ్రెస్ గెలుపు గుర్రాలనే బరిలోకి దింపుతోంది. అధికార పార్టీ అభ్యర్థులను ఢీకొట్టే వారికే టికెట్లు ఇవ్వాలని భావిస్తోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో మొదటి విడతలో ఆరు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. మిగిలిన ఆరు స్థానాల్లో అధికార పార్టీ నుంచి బలమైన అభ్యర్థులున్నారు. దాంతో వీరిని ఎదిరించే వారికే టికెట్ కేటాయించేందుకు అధిష్టానం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఆయా నియోజకవర్గాల్లో ఆశావహులు మూడు నుంచి నలుగురు ఉండటంతో జల్లెడ పడుతోంది. వివిధ కోణాల్లో సర్వేలు నిర్వహిస్తోంది. ఈ సర్వేల ఆధారంగా అభ్యర్థుల బలబలాలు గుర్తించి టికెట్ కేటాయించనుంది. అయితే తమ అభ్యర్థులు బలహీనంగా ఉంటే ఇతర పార్టీల్లో బలమైన వీరిని పార్టీలోకి తీసుకొచ్చి వారికి టికెట్ కేటాయించాలని పార్టీ భావిస్తున్నట్టు సమాచారం.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రస్తుతం కాంగ్రెస్‌కు ఒక ఎమ్మెల్యే కూడా లేకపోవడంతో రంగారెడ్డి జిల్లాపై పట్టుసాధింపునకు ఎఐసిసి ప్రత్యేక చొరవ తీసుకున్నట్టు తెలుస్తోంది. నియోజకవర్గానికి ఒక ఇన్‌చార్జిగా ఎఐసిసి సభ్యులను కేటాయించింది. జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో అధికార పార్టీ అభ్యర్థులను ఢీకొట్టే సత్తా ఉన్న అభ్యర్థుల కోసం పదుల సంఖ్యలో సర్వేలు చేసింది. అభ్యర్థుల జాబితాను గుర్తించి అందులో నుంచి స్క్రినింగ్ చేసి బలమైన నాయకులను బరిలో నిలిపేందుకు కసరత్తు చేస్తోంది. ఇటీవల మొదటి విడతలో భాగంగా జిల్లాలో ఆరు నియోజకవర్గాలకు టికెట్లు కేటాయించింది. మరో ఆరు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, రాజేందర్‌నగర్, శేరిలింగంపల్లి, ఎల్‌బినగర్, తాండూరు నియోజకవర్గాలకు అభ్యర్థులను కేటాయించాల్సి ఉంది. అయితే ఈ ప్రాంతాల్లో బిఆర్ఎస్ అభ్యర్థులు బలంగా ఉండటంతో వారిని ఢీకొట్టే నాయకులను రంగంలోకి దింపేందుకు కాంగ్రెస్ అధిష్టానం ప్రయత్నం చేస్తోంది. దీనికి తోడు టికెట్ల ఆశ చూపి ఇతర పార్టీల నుంచి నాయకులను చేర్చుకున్న కాంగ్రెస్‌కు టికెట్ల కేటాయింపులో తలకు మించిన భారంగా మారింది. ఒక్కో నియోజకవర్గంలో నాలుగు నుంచి ఐదు మంది ఆశావహులు ఉండటంతో ఎవరికి సర్ది చెప్పాలో తేల్చుకోలేని పరిస్థితి నెలకొంది. పైగా భంగపడే వారు కాంగ్రెస్‌కు ఎక్కడ కొర్రీలు పెడతారోనని తర్జనభర్జన పడుతున్నారు. అయితే ఆశావాహులను బుజ్జగించేందుకు టిపిసిసి ప్రత్యేక టీమ్ వేసినట్టు తెలుస్తోంది. టికెట్ల కేటాయింపులో ఎన్ని అడ్డంకులు వచ్చినా వాటిని చేధించి గెలుపు గుర్రాలనే బరిలో దింపాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది.

బిఆర్ఎస్‌కు ఇసి గుబులు

- ఎఐఎస్‌ల సమాలోచనలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికల సంఘం సంచలన నిర్ణయాలతో హడావిడి చేస్తున్నది. ఒకవైపు బిఆర్ఎస్ సర్కారు, మరోవైపు ఉన్నతాధికారుల వెన్నులో చలిపుట్టించేలా పావులు కదుపుతున్నది. ఏకంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపిలకే వార్నింగ్ ఇచ్చిందంటే రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎన్నికలను సజావుగా నిర్వహించాల్సిందే. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలను ఎన్నికల్లో భాగస్వాములను చేయాల్సిందే. వారి తీర్పే ప్రజాప్రాతినిధ్య వ్యవస్థలకు శిరోధార్యం. ఎన్నికల కమిషన్ తీసుకుంటున్న నిర్ణయాల్లో కొందరికి మోదమైతే, మరికొందరికి ఖేదాన్ని కలిగిస్తున్నాయి. నవంబరు మూడున ఎన్నికల నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో అదే నెల 30న పోలింగ్, డిసెంబరు మూడున ఫలితాలు రానున్నాయి. ఈ పరిస్థితుల్లో ఎన్నికల కమిషన్ నిర్ణయాలు నిరుద్యోగులకు ఆశనిపాతంగా మారాయి. ఇప్పటికే టిఎస్‌పిఎస్‌సి గ్రూప్-2 వాయిదా వేసింది. ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి డీఎస్సీని వాయిదావేస్తూ పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. దీనికి కారణం ఎన్నికల నేపథ్యంలో ఉద్యోగ నియామకాల పరీక్షల నిర్వహణ అంతసులువు కాదనీ, భద్రత కల్పించలేమని పోలీస్ శాఖ చేతులెత్తేసింది. చరిత్రలో ఎప్పుడులేనివిధంగా అఖిల భారత సర్వీసు అధికారులను పూర్తిగా ఎన్నికలకు దూరంగా పెట్టడం ఇదే మొదటిసారి. ఉమ్మడిరాష్ట్రంలో కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. విశాఖ జిల్లాలో ఒక నియోజకవర్గం రిటర్నింగ్ అధికారిని ఎన్నికల కమిషన్ అనుమతి లేకుండా మార్చారనే కారణంతో అప్పటి ఆ జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌ప్రకాశ్‌ను ఇప్పటివరకు ఎన్నికలకు దూరంగా ఉంచుతున్నది. ఇప్పటికీ ఆయన బ్లాక్‌లిస్ట్‌లోనే ఉన్నారు. తాజాగా తెలంగాణలో చోటుచేసుకున్న బదిలీలతో ఒకింత ఐఎఎస్, ఐపీఎస్ అధికారులు నొచ్చుకున్నట్టు తెలిసింది. బదిలీలు చేస్తారే తప్ప, మొత్తం ఎన్నికల ప్రక్రియకు దూరంగా పెట్టడం అవమానించడమేననే గుసగుసలు వారి నుంచి వినిపిస్తున్నాయి. ఇది అసాధారణమైన చర్యే. ఎన్నికల ముందు బదిలీలు సహజమే. కానీ, ఈసీ తీసుకున్న చర్యలు సమంజసం కాదని అభిప్రాయపడుతున్నారు. వీరిని తాత్కాలికంగా ఎన్నికల బాధ్యతల నుంచి తప్పించారా ? లేక శాశ్వతంగా బ్లాక్‌లిస్ట్‌లో పెడతారా ? అనేది స్పష్టత రావాల్సి ఉంది. అలాగే ఐఎఎస్ అధికారి టికె శ్రీదేవి ఎన్నికల కమిషన్ చర్యను తప్పుపట్టారు. వాణిజ్యపన్నుల శాఖలో చార్జ్ తీసుకున్న నాలుగురోజుల్లో ఆమెపై బదిలీ వేటుపడటం చర్చనీయాంశమైంది. దీంతో సోషల్ మీడియాలో సదరు ఐఎఎస్ అధికారి ట్విట్‌పెట్టి నిరసన తెలిపింది. ఎన్నికల కమిషన్ చర్యలపై కోర్టుకుగానీ, క్యాట్‌కు గానీ వెళ్లే యోచనలో కొంత మంది సీనియర్ అధికారులు ఉన్నారనే ప్రచారం జరుగుతున్నది. అక్కడకు వెళ్లినా ప్రయోజనం ఉండదని కొందరు సీనియర్ అధికారులు అంటున్నారు. ఈ అంశాన్ని ఐఎఎస్, ఐపీఎస్ అధికారుల అసోసియేషన్లు సైతం పరిశీలిస్తున్నట్టు వినికిడి. ఇదిలావుండగా ఎన్నికల కమిషన్ చర్యలకు బిఆర్ఎస్ సర్కారుకు దిమ్మె తిరిగినట్టయింది. ఎన్నికల ముందే తమకు అనుకూలమైన అధికారులను తమకు అవసరమున్న జిల్లాల్లో నియమించుకున్నది. అయితే ఇక్కడ కేంద్ర ఎన్నికల సంఘం ఆలోచన అంతవరకే పరిమితం కాలేదు. మొత్తం అఖిల భారత సర్వీసు అధికారులు ఎవరెవరు ఎక్కడెక్కడ పనిచేశారు. గతంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు, లోకల్ పోస్టుల్లో సీనియర్లను కాకుండా తక్కువస్థాయి క్యాడర్ అధికారుల నియామకాలపై దృష్టిసారించినట్టు సమాచారం. అందులో రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల జిల్లాలైన రంగారెడ్డి, మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లాల్లో మరీ జూనియర్ ఐఎఎస్‌లను నియమించడంపై ఈసీ సమాలోచనలు చేసినట్టు సమాచారం. కలెక్టర్లు ఆమోయ్‌కుమార్, హరీశ్‌లు రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ ఇలా దగ్గరదగ్గర కీలకమైన జిల్లాల్లో పనిచేయడం గమనార్హం. ఎన్నికల సంఘం ఇంత కఠినంగా వ్యవహరించడంలో పరోక్షంగా కేంద్రం హస్తం ఉండొచ్చని అఖిల భారత సర్వీసుల అధికార వర్గాల్లో చర్చ నడుస్తున్నది. బజెపి నేతలు ప్రధానంగా కేంద్ర మంత్రులస్థాయిలో ఐఎఎస్‌లపై ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. తమకు విలువ ఇవ్వడం లేదనీ, అంతా గులాబీ బాస్‌కే చప్పట్లు కొడుతున్నారనే ఆరోపణలు , విమర్శలు దాదాపుగా ఏడాది క్రితం నుంచే ఉన్నాయి. తెలంగాణలో బిఆర్ఎస్‌ది ఆడింది ఆట, పాడింది పాటగా సాగుతున్నదనే ఫిర్యాదులు ఎప్పటికప్పుడు మో-షాలకు సమాచారం పేర ఫిర్యాదులు సైతం తరచుగా వెళ్లాయని అంటున్న వారూ లేకపోలేదు. బిజెపితో అంతర్గత ఒప్పందంతో అంటకాగి ముచ్చటగా మూడోసారీ అధికార పగ్గాలు చేపట్టాలని ఉవ్విళ్లూరుతున్న కెసిఆర్ పార్టీకి కండ్లు బైర్లు కమ్మేలా ఈసీ తీసుకుంటున్న చర్యలు అంతుబట్టడం లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కావాలనే మో-షా లు తెలంగాణలో పాగా వేసేందుకు వేసిన పకడ్బంది వ్యూహమని చెబుతున్న వారూ ఉన్నారు. ఒకానొక దశలో కెసిఆర్ ముందస్తు ఎన్నికలకు వెళితే రాష్ట్రపతి పాలన పెట్టి ఫుట్‌బాల్ ఆడుకోవాలని బిజెపి ప్రభుత్వం భావించింది. అందుకు ఇటీవల ప్రధాన నరేంద్రమోడీ నిజామాబాద్‌లో చేసిన వ్యాఖ్యలే నిదర్శనం. అందుకు ప్రతిగా కెటిఆర్, హరీశ్‌రావు ఇతర మంత్రులు తప్ప, సిఎం కెసిఆర్ నోటి నుంచి ఒక్కమాటా అనకపోవడం తెలియనిది కాదు. ఆరోగ్యం బాగాలేపోయినా, రాజకీయ విమర్శలు చేయాల్సి వచ్చినప్పుడు కెసిఆర్ కనీసం పత్రికా ప్రకటనలు పంపే అలవాటు ఉంది. ఇప్పుడది జరగకపోవడం ఆశ్చర్యమే. ఏదేమైనా ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తొలినాళ్లల్లోనే రాష్ట్ర రాజకీయాలు రసకందాయంలో పడ్డాయనడంలో సందేహం లేదు.



అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు

- సిపిని ఆదేశించిన హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ వార్ రూమ్ వలంటీర్ల నిర్బంధంపై తెలంగాణ హైకోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. వలంటీర్ల నిర్బంధంపై విచారణకు ఆదేశించింది. నిబంధనలకు విరుద్ధంగా పోలీసులు వ్యవహరించారన్న హైకోర్టు.. అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ సిపిని ఆదేశించింది. సిఎం కెసిఆర్, కెటిఆర్, కవిత ఫొటోలను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారంటూ గత డిసెంబరులో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వారిని అక్రమంగా నిర్బంధించారంటూ కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం తాజాగా తీర్పు వెలువరించింది.

నూతన అధ్యాపకులకు మే వేతనాలు చెల్లించాలి

- ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శికి టిజిజెఎల్ఎ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని 'ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న నూతన అధ్యాపకులకు పెండింగ్‌లో ఉన్న మే వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ (టిజిజెఎల్ఎ-475) డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శికి ఆన్‌లైన్ ద్వారా వినతి పత్రాన్ని ఆ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వస్కుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ సోమవారం పంపించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను మేలో క్రమబద్ధీకరించారని గుర్తు చేశారు. ఈ క్రమబద్ధీకరణ జరిగిన నూతన అధ్యాపకులకు ఆ నెల వేతనాలు ఇంతవరకు అందలేదని వివరించారు. సుమారు రెండు వేల మందికి పైగా టోకెన్ నెంబర్లు వచ్చి ఈ-కుబేర్‌లో పెండింగ్ చూపిస్తున్నాయని తెలిపారు. ఆర్థిక శాఖ కార్యదర్శి వెంటనే జోక్యం చేసుకుని ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న నూతన అధ్యాపకుల మే వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.



వాసుదేవ ఆచార్యను పరామర్శించిన సిఐటియు, వ్యకాస నేతలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మాజీ ఎంసి, సిఐటియు అఖిల భారత మాజీ ఉపాధ్యక్షులు వాసుదేవ ఆచార్యను అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పరామర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని యాప్రాల్‌లో గల ఆచార్య ఇంటికి వారు వెళ్లారు. ఇటీవల మరణించిన ఆయన సతీమణి రాజ్యలక్ష్మి చిత్రపటానికి వారు పుష్పగుచ్చాలు పెట్టి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వాసుదేవ ఆచార్యకు ధైర్యం చెప్పారు. ఆయన ఆరోగ్య పరిస్థితుల గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

చివరి భూములకు నీరందించాలి

- కొందరి స్వార్థంతో కాల్వలకు గండ్లు
- గణపవరం వద్ద రైతుల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాగర్ ఎడమ కాలువ నీరు చివరి పంట భూముల వరకు అందించాలని రైతులు ధర్నా చేశారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని గణపవరం క్రాస్‌రోడ్ వద్ద మేళ్లచెర్వుకు వెళ్లే ప్రధాన రహదారిపై సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. గణపవరం రామలక్ష్మీపురం ఎర్రవరం, బీక్యాతండా, ఎర్రవరం గ్రామాల పంట పొలాలకు నీరందక ఎండిపోతున్నాయన్నారు. కొంతమంది స్వార్థంతో కాల్వలకు గండ్లు పెట్టుకొని చివరి భూములకు నీరు రాకుండా చేస్తున్నారన్నారు. దీంతో ఎంతో కష్టపడి సాగు చేసిన పైర్లు కండ్ల ముందే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గణపవరం గ్రామం వరకు చుక్క నీరు రావడం లేదని, సాగర్ నీరు వదిలి వారం రోజులవుతున్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని వాపోయారు. కెనాల్‌కు నీటిని అధికంగా వదలాలని రైతులు కోరారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు బ్రమధు, సుమన్‌రెడ్డి, అన్నెం అంజిరెడ్డి, వేమూరిమధురెడ్డి, బచ్చయ్య, లక్ష్మయ్య, రాధాకృష్ణ, ధనమూర్తి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

20 ఏళ్లు జైలు శిక్ష

బాలికపై లైంగిక దాడి కేసులో కోర్టు తీర్పు

ప్రజాశక్తి -బహైదరాబాద్ బ్యూరో

బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తికి 20 ఏండ్లు జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ పొక్సో స్పెషల్ జడ్జి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణ బాబు సోమవారం తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన యువకుడు కీర్తి నరేష్, మండలంలోని మరో గ్రామానికి చెందిన బాలికపై 1-9-2022న లైంగికదాడి, అసభ్యకరంగా ప్రవర్తిస్తూ సెల్ఫీ ఫోటోలు దిగి, బ్లాక్ మెయిల్ చేసి, చాటింగ్ చేయాలని వేధించాడు. లేదంటే ఫొటోలను యూట్యూబ్, వాట్సాప్‌లో పెడతానని భయభ్రాంతులకు గురి చేసి బాలికను శరీరకంగా హింసించాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ అభినవ్ కేసు నమోదు చేసి నరేష్‌ను రిమాండ్‌కు తరలించారు. అనంతరం అప్పటి చిట్యాల సిఐ పులి వెంకట్ పూర్తిస్థాయిలో విచారణ జరిపి కోర్టులో ఆధారాలు సమర్పించారు. ఈ కేసులో వాదనలు విన్న పొక్సో స్పెషల్ జడ్జి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి నారాయణ బాబు తీర్పు వెలువరించారు.



ఆంధ్ర నాట్యం నవరస భరితం

ప్రజాశక్తి - కల్చరల్

విఖ్యాత నాట్యాచార్యులు నటరాజ రామకృష్ణ రూపకల్పన చేసిన ఆంధ్ర నాట్య సంప్రదాయం ఆయన శిష్యులు కళా కృష్ణ కొనసాగించి ఎందరినో ఆ ప్రక్రియ ఉత్తమ నాట్య గురువులు గా తీర్చిదిద్దారు . రేఖ గరిసినకుర్తి శిష్య బృందం శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై లాస్య రంజని సంస్థ నిర్వహణ లో ఆంధ్ర నాట్యం నవరస భరితం గా నర్తించారు.తొలి అంశం గా కుంభ హారతి తో ఆరంభించి వినాయక కౌతమ్, తదితర అంశాలను మనోహరం గా ప్రదర్శించారు. నట్టువాంగం గురువు రేఖ చేయగా విద్వాన్ అనిల్ గాత్ర సహకారం అందించారు. మృదంగం పై వీరాస్వామి ఘటం పై సుష్మిత సహకరించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కళా కృష్ణ పాల్గొని పేరిణి ఆంధ్ర నాట్యం. రెండూ నటరాజ రామకృష్ణ మానస పుత్రిక లని అన్నారు. వేదిక పై పేరిణి శ్రీనివాస్ రావు,పేరిణి కుమార్ ,పద్మ తదితరులు రేఖా నాట్య ప్రతిభను ప్రశంసించారు.

విద్యుద్ఘాతానికి గురై అన్‌మ్యాన్డ్ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సబ్‌స్టేషన్ ఆపరేటర్ నిర్లక్ష్యంతో విద్యుద్ఘాతానికి గురై విద్యుత్ స్తంభం పోల్‌పై నుంచి కిందపడి తీవ్ర గాయాలపాలైన అన్‌మ్యాన్డ్ ఉద్యోగి చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ సంఘటన జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో ఆదివారం జరిగింది. అన్‌మ్యాన్డ్ ఉద్యోగి జనగాని కిరణ్ (32) గణపురం మండలం అప్పయ్యపల్లి సమీపంలోని మోరంచ వద్ద ఎల్‌సి తీసుకుని కరెంటు స్తంభం ఎక్కాడు. ట్రాన్స్‌ఫార్మర్ హెడ్ ఫ్యూజ్‌వైర్ వేస్తుండగా విద్యుద్ఘాతానికి గురయ్యాడు. దాంతో కిరణ్ విద్యుత్ స్తంభంపై నుంచి కింద పడటంతో తల, నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. దాంతో వరంగల్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు మంజూరు చేయాలి

- డిహెచ్‌కు జిఒ 142పై టిఎంఎల్‌టిఎ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని 235 అర్బన్ హెల్త్ సెంటర్లకు గానూ ఒక్కో దాంట్లో రెండు చొప్పున పోస్టులను మంజూరు చేయాలని తెలంగాణ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ (టిఎంఎల్‌టిఎ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ నిజాముద్దీన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు హరిశంకర్, కంచర్ల శ్రీకాంత్, విజయభాస్కర్, చంద్రశేఖర్, మోహన్‌రావు తదితర యూనియన్ నాయకులు సోమవారం రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ గడల శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రెండు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు కావాలనీ, టీ-హబ్‌లో రెగ్యులర్ పోస్టు మంజూరు చేయాలని కోరారు. ల్యాబ్ టెక్నీషియన్ల సేవలు వైద్యారోగ్యశాఖలో కీలకమనీ, తమపై చిన్నచూపు చూడొద్దని విజ్ఞప్తి చేశారు.

మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, బిజెపి నాయకులు కుంజా సత్యవతి ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో భద్రాచలంలోని ఆమె నివాసంలో తీవ్రమైన ఛాతి నొప్పి రావడంతో హాస్పిటల్‌కి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. సిపిఎంలో ప్రారంభమైన ఆమె రాజకీయ ప్రస్థానంలో పార్టీ తరపున వైస్ ఎంపిపిగా పనిచేశారు. 2009లో సిపిఎం పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. 2009లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఆమె ఓటమిపాలయ్యారు. మారిన రాజకీయ సమీకరణలో 2018లో బిజెపి తరపున పోటీ చేసి మరోసారి ఓటమి పాలయ్యారు. కుంజా సత్యవతి సొంత ఊరు విఆర్‌పురం మండలం ఒడ్డుగూడెం గ్రామం. సత్యవతి మృతదేహానికి స్థానిక శాసన సభ్యులు పోదెం వీరయ్య, సిపిఎం నాయకులు, ప్రముఖులు నివాళి అర్పించారు.

కార్మికుల బాగోగులు పై మ్యానిఫెస్టోల్లో చేర్చాల్సిందే

- రూ.26 వేల కనీసవేతనం అమలుపై స్పష్టతివ్వాలి
- సంఘటిత, అసంఘటిత సమస్యల పరిష్కారంపై హామీనివ్వాలి
- 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాల సవరణపై స్పందించాలి
- సిఐటియు రౌండ్‌టేబుల్ సమావేశంలో ఉద్యోగ, కార్మిక సంఘాల నేతల డిమాండ్
- వర్కర్స్ మ్యానిఫెస్టో విడుదల.. 18న ఆయా పార్టీలకు అందజేత



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర జనాభాలో 30 శాతానికిపైగా ఉన్న కార్మికులకు రూ.26 కనీస వేతనం అమలు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పర్మినెంట్, సంఘటిత, అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల మిగతా సమస్యల పరిష్కారంపై ఆయా పార్టీలు తమ మ్యానిఫెస్టోల్లో స్పష్టంగా చెప్పాలని తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. తమ మ్యానిఫెస్టోల్లో కార్మికుల బాగోగులు, మెరుగైన జీవనం కోసం తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామనే విషయాన్ని అన్ని పార్టీలూ ప్రకటించేలా ఒత్తిడి తెస్తామన్నారు. ఈ నెల 18 నుంచి ఆయా పార్టీల మ్యానిఫెస్టో రూపకల్పన కమిటీలకు తాము రూపొందించిన వర్కర్స్ మ్యానిఫెస్టో అందజేస్తామని వెల్లడించారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో అన్ని కార్మిక, ఉద్యోగ సంఘాల నేతలతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. దీనికి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అనేక అంశాలపై చర్చించి వర్కర్స్ మ్యానిఫెస్టో రూపొందించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ జిఒలను సవరించడం, విడుదలైన ఐదు జిఒలకు గెజిట్ జారీ చేయడం, కనీస వేతనం రూ.26 వేలు అమలు ఎప్పటిలోగా చేస్తామనే దాన్ని పార్టీలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి వివిధ శాఖలు, సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పర్మినెంట్‌పైనా స్పష్టతివ్వాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు గడువులోపు పిఆర్‌సిని 30 శాతంగా ఫైనలైజ్ చేయడం, కాంట్రాక్ట్, అవేట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా ఐఆర్ ఇవ్వడం అంశాలను పొందుపర్చాలని కోరారు. స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించి సామాజిక భద్రత చట్టాలను అమలు చేసేలా నిర్ణయం ప్రకటించాలన్నారు. స్థానిక సంస్థల్లో పనిచేసే గ్రామ పంచాయితీ, మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచడం, ఉద్యోగ భద్రత కల్పించడం, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర శాసనం చేయడం, వారికి పెన్షన్ నెలకు రూ.ఏడు వేలు చెల్లించడం, మందుల ధరలు తగ్గించడం, మందులు, మందుల తయారీ పరికరాలపై జిఎస్‌టి ఎత్తివేయడం, నూతన పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం, బిడి పరిశ్రమకు నష్టదాయకమైన కోప్టా చట్టాన్ని రద్దు చేయడం వంటి అంశాలపై అన్ని పార్టీలూ తమ వైఖరేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. మూసేసిన పరిశ్రమలను తెరిపించడం, సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో కాంట్రాక్ట్ కార్మికులకు ఓటు హక్కు కల్పించడం, సింగరేణి లాభాల్లో పర్మినెంట్ ఉద్యోగులకు వాటాగా బోనస్ చెల్లిస్తున్నట్లుగానే కాంట్రాక్ట్ కార్మికులకూ లాభాల వాటాను చెల్లించడంతో పాటు మరికొన్ని అంశాలను వర్కర్స్ మ్యానిఫెస్టోలో చేర్చామనీ, వీటిన్నింటికీ అన్ని పార్టీలూ తమ మ్యానిఫెస్టోల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డి చంద్రశేఖర్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్‌రాజ్, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రెబ్బా రామారావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కె.సూర్యం, ఎం శ్రీనివాస్, జనార్ధన్, టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎంకె బోస్, బిడి కార్మిక సంఘం, ఐఎన్‌టియుసి, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్, బిడిఎల్ ఎంప్లాయీస్ యూనియన్, ఎస్‌డబ్ల్యుఎఫ్, హెచ్‌ఆర్‌జిఐఇఎ, టిఎంఎస్‌ఆర్‌యు, పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్, ప్రయివేట్ ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్, సెక్యూరిటీ గార్డ్స్ వర్కర్స్ యూనియన్, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, వర్కర్స్ యూనియన్, ఐఎఫ్‌టియు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

ద్రోహం చేసిన కుటుంబానికి టికెట్

- కాంగ్రెస్‌లో ఉదయపూర్ డిక్లరేషన్ ఏమైంది?
- మాజీ మంత్రి నాగం జనార్ధన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిరంతరం కాంగ్రెస్ పార్టీని ఓడించడమే పనిగా పెట్టుకుని.. శాసనమండలి పక్షాన్ని సైతం బిఆర్‌ఎస్‌లో విలీనం చేసి పార్టీకి ద్రోహం చేసిన దామోదర్‌రెడ్డి కుటుంబానికి టికెట్ కేటాయించడంపై మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తాను కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశా.. అయినా టికెట్ కేటాయించకపోవడం అన్యాయం.. దీనికి పిసిసి అధ్యక్షులు, రాష్ట్ర నేతలు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలపై పార్టీ ఇచ్చిన పిలుపులను విజయవంతం చేయడంతోపాటు రాహుల్ గాంధీ పర్యటనను విజయవంతం చేసిన తనను కాదని మరొకరికి ఎలా టికెట్ కేటాయిస్తారని ప్రశ్నించారు. టికెట్ కేటాయింపులో ఉదయపూర్ డిక్లరేషన్ ఎందుకు అమలు చేయడం లేదన్నారు. సర్వేల పేరుతో రాష్ట్ర నాయకత్వం టికెట్ కేటాయించడం సరికాదన్నారు. తాను కష్టపడితే ఇతరులకు టికెట్ ఎలా కేటాయిస్తారని, వారికి ఉన్న అర్హత ఏంటని ప్రశ్నించారు. సర్వే పేరుతో తనకు నమ్మకద్రోహం చేశారని, ఎక్కడ సర్వే చేశారో స్పష్టం చేయాలని అన్నారు. తాను ఎప్పుడూ సొంత నిర్ణయం తీసుకోలేదని, కార్యకర్తల అభిప్రాయం మేరకే పని చేస్తానని, నామినేషన్ గడువులోపు తన వైఖరిని స్పష్టం చేస్తానని తెలిపారు. తనను బుజ్జగించేందుకు వచ్చిన మాణిక్యం ఠాక్రే, జానారెడ్డి, చిన్నారెడ్డి లాంటి నాయకులకు తన బాధను వివరించానన్నారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ నాగం శశిధర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అర్థం రవి, వివిధ మండలాల అధ్యక్షులు కోటయ్య, లక్ష్మయ్య, మిద్దె రాములు, అర్జునయ్య, పాండు, నిజాం సత్యం, భీముడు, అహ్మద్ పాషా తదితరులు ఉన్నారు

సెలూన్ యజమాని దారుణ హత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



హైదరాబాద్ కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పాపారాయుడు నగర్‌లో దారుణ ఘటన జరిగింది. సెలూన్ యజమానికి హత్యకు గురయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలకృష్ణనగర్‌లో నివాసముండే అశోక్(42) పాపారాయుడు నగర్‌లో 'హర్షలుక్స్' అనే సెలూన్ నడిపిస్తున్నాడు. ఆదివారం రాత్రి 12 దాటినా అశోక్ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పలుమార్లు ఫోన్ చేశారు. అయినా స్పందించకపోవడంతో నేరుగా సెలూన్‌కు వెళ్లారు. అక్కడ అశోక్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. అది చూసి కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో స్థానికులు కూకట్‌పల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు.

గుర్తుతెలియని దుండగులు అశోక్‌ను హత్య చేసినట్టు తెలుస్తోంది. సెలూన్‌లోని సిసి కెమెరాలను, హార్డ్ డిస్క్‌ను ధ్వంసం చేసి పరారయ్యారు. అయితే ఇతర సిసి కెమెరాల ఆధారంగా.. గతంలో అశోక్ దగ్గర పని చేసిన బిహార్‌కు చెందిన వ్యక్తితో పాటు పలువురు ఈ హత్య చేసినట్టు పోలీసులు గుర్తించారు. పని సరిగ్గా చేయడం లేదని మందలించినందుకే హత్య చేసి పరారయినట్టు మృతుడి కుటుంబసభ్యులు అనుమానిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు కూకట్‌పల్లి సిఐ సురేందర్ గౌడ్ తెలిపారు.

స్నానానికి నదిలో దిగి ఇద్దరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం గోదావరిలో ఆదివారం స్నానానికి దిగి గల్లంతై ఇద్దరు మృతిచెందారు. కాళేశ్వరం ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మహరాష్ట్ర గడ్చిరోలి జిల్లా సిరోంచ తాలుక రంగధాంపేటకు చెందిన కోనం లక్ష్మి నారాయణ, అనారోగ్యంతో బాధ పడుతున్న భార్య సుశీలతో పాటు కుమారుడు రామేశ్వర్(18), అదే గ్రామానికి చెందిన (దేవరతూలె..) చిలుముల సురేష్ (32)తో కలిసి శనివారం కాళేశ్వరం చేరుకున్నారు. ఆదివారం ఉదయం సురేష్, రామేశ్వర్ గోదారిలో స్నాన ఘాట్ వద్దకు వెళ్లి తిరిగి రాలేదు. వారి కోసం గోదావరి పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. సోమవారం స్థానిక జాలర్లకు నదిలో తేలిన మృతదేహాలు కనబడగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారి సహాయంతో ఇద్దరి మృతదేహాలను బయటికి తీసి పోస్టుమార్టం కోసం సిహెచ్‌సికి తరలించారు. రామేశ్వర్ తండ్రి లక్ష్మినారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న నీలం మధు

అహంకారానికి.. ఆత్మగౌరవానికి పోటీ

- చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్
- బిఆర్‌ఎస్ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పటాన్‌చెరు నియోజకవర్గంలో అహంకారానికి.. ఆత్మగౌరవానికి జరుగుతున్న పోటీల్లో ఎన్నటికైనా ఆత్మగౌరవమే విజయం సాధిస్తుందని ఎన్‌ఎంఆర్ యువసేన రాష్ట్ర నాయకులు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం బిఆర్‌ఎస్ క్రియాశీల సభ్యత్వానికి ఆయన రాజీనామా చేశారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామం నుంచి ఎంఎన్‌ఆర్ యువసేన ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభించారు. ఈ యాత్ర మంబాపూర్, నల్లవల్లి, లక్ష్మాపూర్ తాండా, నాగిరెడ్డిగూడెం గ్రామాల మీదుగా చేపట్టారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ.. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని ఓడించాలంటే నియోజకవర్గంలో సబ్బండ కులాలు ఏకమవ్వాలన్నారు. నిరంతరం ప్రజాసేవలో ఉన్న తనకు టికెట్ ఇస్తానని చెప్పి.. ఇవ్వకుండా మోసం చేసిన కుటుంబ పాలనకు చరమ గీతం పాడాలని తెలిపారు. 'మీ బిడ్డనై వస్తున్నా.. ఆశీర్వదించి, గెలిపించండి.. మీ రుణం తీర్చుకుంటా' అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇక్కడున్న మేధావులు, యువకులు, విద్యావంతులందరూ వచ్చే ఎన్నికల్లో అఖండ మెజార్టీతో తనను గెలిపించాలని కోరారు. తాను విజయం సాధిస్తే.. అహంకారంపై ఆత్మగౌరవం విజయం సాధించినట్టు సంతోషపడతానన్నారు. నాలుగేండ్లుగా ప్రజలు ఎన్‌ఎంఆర్ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తూ వస్తున్నామన్నారు. ఇక మీదట కూడా ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కారిస్తానని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని గుమ్మడిదల, జిన్నారం, అమీన్పూర్, రామచంద్రపూర్, పటాన్‌చెరు.. ఎన్‌ఎంఆర్ యువసేన సభ్యులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేశారు.



చేనేత సంక్షేమానికి హామీ ఇవ్వాలి

- చేనేత కార్మిక సంఘం రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేనేత కార్మికుల కోసం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలపై ఆయా రాజకీయ పార్టీలు అధికారంలోకి వస్తే స్పష్టమైన హామీ ఇవ్వాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు వనం శాంతికుమార్ అధ్యక్షతన ఆయా రాజకీయ పార్టీల మేనిఫెస్టోల్లో చేర్చే విధంగా విధాన రూపకల్పన కోసం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, చేనేత పరిశోధకులు డి. నరసింహారెడ్డి, అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ , చేనేత కార్మిక సంఘం ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాసికంటి లక్ష్మీనరసయ్య, చేనేత వర్గాల చైతన్య వేదిక కన్వీనర్ చిక్క దేవదాస్, కందగట్ల బిక్షపతి, గణేష్ ,మురళి, కూరపాటి రాములు, రాజేష్, సత్యనారాయణ, ఉప్పలయ్య, ధనలక్ష్మి, రమణ తదితరులు మాట్లాడారు. సమావేశంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలకు ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు.

చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార వ్యవస్థను నిర్వీర్యం చేశాయని విమర్శించారు. ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించే విధానంలో భాగంగానే ఇలా చేశారని తెలిపారు. పదేండ్ల నుంచి సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా అధికారులు పెత్తనం చేయడమేంటని ప్రశ్నించారు. పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును ఎత్తేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరితో పాటు కేంద్ర ప్రభుత్వ వైఖరి కోసం జాతీయ స్థాయిలో నిలదీయాలని సూచించారు. చేనేత పరిశోధకులు డి.నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కొన్ని దశాబ్దాలుగా రాజకీయ పార్టీల కోసం తయారు చేసే హరిత మేనిఫెస్టోల్లో చేనేత అభిమానిగా ఆ అంశాన్ని కూడా చేరుస్తున్నట్టు తెలిపారు. రాజకీయ పార్టీలకు మేనిఫెస్టోల్లో చేర్చేందుకు సూచనలు చేయడంతో పాటు చేనేత కార్మికులు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల వద్ద డిమాండ్లు పెట్టాలని సూచించారు. హెచ్‌ఎండిఎ ఏర్పాటుతో హైదరాబాద్ పరిధి విస్తరించి ఆ పరిధిలోకి చేనేత గ్రామాలు కూడా వచ్చాయనీ, అందుకే చేనేత జోన్ ఏర్పాటు చేయాల్సిన అవసరముందని తెలిపారు. సహకార, ప్రయివేటు వ్యవస్థల మధ్య ప్రభుత్వం సగటు చేనేత కార్మికునికి ఎలా చేయూతనందిస్తుందో స్పష్టం చేయాల్సిన అవసరముందన్నారు. అపెక్స్ సహకార సంస్థ ఏర్పాటు చేసి ఉన్న సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. చేనేత కార్మికుల కోసం బిజెపి, బిఆర్‌ఎస్ ప్రభుత్వాలు ఏమి చేయలేదని విమర్శించారు. చేనేత కార్మికులకు కనీసం రూ.10 వేల కోట్ల రుణం ఇవ్వాల్సిన అసరముందని తెలిపారు. బిడి కార్మికులకు ఇచ్చినట్టు చేనేత కార్మికులకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మైనింగ్ రంగంలో సవాళ్లను అధిగమించాలి

- ఎన్‌ఎండిసి చైర్మన్ అమితవ ముఖర్జీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో మైనింగ్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను ఇంజనీర్లు అవకాశాలుగా మార్చుకోవాలనీ, దేశ జిడిపి ఎదుగుదలకు సహకరించాలని ఎన్‌ఎండిసి చైర్మన్, ఎండీ అమితవ ముఖర్జీ కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎన్‌ఎండిసి సమావేశ మందిరంలో మైనింగ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ జనరల్ బాడీసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో గుర్తించిన మైనింగ్ నిలువలు 22 శాతం ఉండగా, వీటిలో సమగ్ర అన్వేషణ జరిగినవి కేవలం 6శాతం మాత్రమేననీ, ప్రస్తుతం మైనింగ్ జరుగుతున్నది రెండు శాతం మాత్రమేనని పేర్కొన్నారు. ఈ రెండు శాతాన్ని రెట్టింపు చేస్తే మైనింగ్‌లో జిడిపి నాలుగు శాతం వృద్ధి చేకూరుతుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మైనింగ్ పరిశ్రమలను అధ్యయనం చేసిన ఫెజర్ ఇన్‌స్టిట్యూట్ అత్యుత్తమ 100 పరిశ్రమల జాబితాను రూపొందించగా దానిలో భారత్‌కు స్థానం లేకపోవడం ఆలోచించాలని తెలిపారు. పర్యావరణ హితంగా మైనింగ్‌ను నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మొక్కలు నరకడం కాదనీ, వాటిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మూతపడిన గనులను పూర్వస్థితికి తీసుకురావడం ద్వారా.. పచ్చదనాన్ని వృద్ధి చేయాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ జాతీయ మాజీ అధ్యక్షులు ఎండి ఫషీయుద్దీన్, వి డి. రాజగోపాల్, నరసయ్య , హైదరాబాద్ చాప్టర్ మాజీ అధ్యక్షులు బి.ఆర్.వి సుశీల్ కుమార్, ఎన్‌ఎండిసి డైరెక్టర్ టెక్నికల్ వినయ్ కుమార్ తదితరులు మాట్లాడారు.

చైర్మన్‌గా వినయ్ కుమార్ ఎన్నిక..

సమావేశంలో కొత్త కమిటీని ఎన్నుకున్నట్టు తెలిపారు. అధ్యక్షులుగా వినయ్ కుమార్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఎమ్మెస్ వెంకట్రామయ్య, కార్యదర్శిగా ఎల్ కృష్ణ, జాయింట్ సెక్రెటరీగా వి బాలకోటి రెడ్డి, కోశాధికారిగా డాక్టర్ ఎస్‌కె సింహం ఎంపికయ్యారు. మరో తొమ్మిది మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.

విద్యార్థుల మరణమృదంగం

- గతంలో రైతులు, చేనేత కార్మికుల ఆత్మహత్యలు
- ఇప్పుడు నిరుద్యోగుల బలవన్మరణం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతోనే మనస్తాపం
- వాగ్దానాలు అమలు కాక, ఉద్యోగాలు రాక మనోవేదన
- గ్రూప్-2, డిఎస్‌సి వాయిదాతో ప్రవళిక ఆత్మహత్య
- బలవన్మరణం వద్దు... పోరాడి సాధించుకుందాం
- రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన సంఘాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో గిట్టుబాటు ధర లేక, అప్పుల పాలు కావడంతో రైతు ఆత్మహత్యలు అందరినీ కలచివేసింది. మార్కెట్ సౌకర్యం లేక, నేసిన వస్తువులు అమ్ముడుపోక, దినదిన గండంతో ఇల్లు గడవక చేనేత కార్మికుల ఆత్మహత్యలనూ చూశాం. అది గతం. ఇప్పుడు విద్యార్థులు, నిరుద్యోగుల మరణాలను చూడాల్సి వస్తోంది. దేశవ్యాప్తంగా మానసిక ఒత్తిడితో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడడం చర్చనీయాంశంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో మనోవేదనకు గురై ఉద్యోగాల భర్తీ ప్రక్రియ సక్రమంగా చేపట్టకపోవడంతో నిరుద్యోగులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఈ సంఘటనలు సమాజంలో అందరినీ ఎంతో దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. తమ పిల్లలు బాగుపడితే చాలనుకుని తల్లిదండ్రులు తినీ, తినకుండా, అప్పు చేసి డబ్బులు ఇచ్చి హైదరాబాద్‌లో కోచింగ్‌లకు పంపిస్తున్నారు. ఎన్నో ఆశలతో ఎలాగైనా ఉద్యోగాలు సంపాదించాలని విద్యార్థులు, నిరుద్యోగులూ పట్టుదలతో చదువుతున్నారు. అయితే ఏళ్ల తరబడి చదువుతూనే ఉన్నారు. తీరా పరీక్షలు నిర్వహించే సమయానికి ఏదో ఒక ఆటంకం ఎదురవుతోంది. దీంతో వారు తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంటున్నారు. అందులో భాగంగానే గ్రూప్-2, డీఎస్సీ రాతపరీక్షలు వాయిదా పడడంతో మనోవేదకు గురైన ప్రవళిక ఆత్మహత్య చేసుకోవడమే ఇందుకు నిదర్శనం. ఆమె మరణం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఆత్మహత్యలు చేసుకోవద్దని, పోరాడి ఉద్యోగాలు సాధించుకుందామని పలు రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన సంఘాలు విద్యార్థులు, నిరుద్యోగులకు పిలుపునిస్తున్నాయి. ప్రవళికది ఆత్మహత్య కాదని, అది ప్రభుత్వ హత్యేనని స్పష్టం చేస్తున్నాయి.

నిరుద్యోగులను మోసం చేస్తున్న మోడీ సర్కారు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తూనే ఉంది. అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రధాని మోడీ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆ హామీని బుట్టదాఖలు చేశారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో 39.77 లక్షలు ఉద్యోగాలు మంజూరయ్యాయి. అందులో 30.13 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇంకా 9.64 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు మోడీ ప్రభుత్వం, 8,82,191 ఉద్యోగాలను భర్తీ చేసింది. అంటే ఏడాదికి లక్ష ఉద్యోగాలను కూడా ఇవ్వలేదు. 2020లో 12,526 మంది విద్యార్థులు చనిపోయారని ప్రకటించింది. అంటే విద్యార్థుల మరణాల సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. రాజస్థాన్‌లోని కోటాలో ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 23 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. గతేడాది 15మంది చనిపోయారు. ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇవ్వకపోవడమే నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకోవడానికి ప్రధాన కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణలో కొలువుల జాడేదీ?

నీళ్లు, నిధులు, నియామకాలు అన్న లక్ష్యాల కోసమే తెలంగాణ ఉద్యమం సాగింది. విద్యార్థులు, నిరుద్యోగులు పెద్దఎత్తున ఉద్యమంలో భాగస్వాములయ్యారు. తెలంగాణ కోసం ఎక్కువ మంది ఆత్మహత్యలు చేసుకుని అమరులయ్యారు. 2014, జూన్ రెండున ప్రత్యేక రాష్ట్రం కల సాకారమైంది. నీళ్లు, నిధులకు సంబంధించి ప్రజలకు ఆ ఫలాలు అందుతున్నాయి. కానీ నియామకాల ప్రక్రియ మాత్రం ఆశించిన స్థాయిలో జరగడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. తొమ్మిదేళ్ల కాలంలో 1.32 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామని ఐటి, పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ ప్రకటించారు. ఇంకా 80 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. అయితే 2004 నుంచి 2014 వరకు పదేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడి రాష్ట్రంలో 24 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని అంటున్నారు. అయితే బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 80,039 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని సిఎం కెసిఆర్ అసెంబ్లీలో గతేడాది ప్రకటించారు. అందులో 35 వేల నుంచి 40 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. 16,604 పోస్టుల భర్తీకి పోలీసు నియామక బోర్డు, 9.210 పోస్టుల భర్తీకి గురుకుల బోర్డు ఆధ్వర్యంలో రాతపరీక్షలను నిర్వహించాయి. పోలీసు కొలువులకు అభ్యర్థుల ఎంపిక కూడా పూర్తయ్యింది. అయితే హైకోర్టు ఆదేశాలతో ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఇక తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి) ఉద్యోగాల భర్తీలో విఫలమై అభాసుపాలవుతోంది. ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా గ్రూప్-1 ప్రిలిమ్స్ మొదటి సారి రద్దయ్యింది. ఆ తర్వాత నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో బయోమెట్రిక్ చేపట్టకపోవడం, ఒఎంఆర్‌లో అభ్యర్థుల వివరాలు పొందుపర్చకపోవడంతో హైకోర్టు మరోసారి రద్దు చేసింది. దీంతో అభ్యర్థులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో గ్రూప్-2, డిఎస్‌సి రాతపరీక్షలు వాయిదా పడ్డాయి. ఎన్‌సిఆర్‌బి నివేదిక ప్రకారం 2014 నుంచి 2021 వరకు తెలంగాణలో 3,600 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని వివరించింది. తాజాగా హైదరాబాద్‌లో ప్రవళిక ఆత్మహత్య సంచలనంగా మారింది. అయితే ఆత్మహత్యలు పరిష్కారం కాదనీ, పోరాడి ఉద్యోగాలను సాధించకుందామని రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన సంఘాలు కోరుతున్నాయి.

ప్రవళిక ఆత్మహత్య అత్యంత విషాదకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఇది ఆత్మహత్య కాదని, ప్రభుత్వ హత్యేనని విమర్శించారు. నియామకాలు ఆలస్యమవుతుండడంతో పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న యువకులు నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారని తెలిపారు. టిఎస్‌పిఎస్‌సి నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధ్యతారహితమని తెలిపారు. టిఎస్‌పిఎస్‌సి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న ప్రవళిక కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగమివ్వాలని కోరారు.

ప్రవళికది ఆత్మహత్య కాదని, ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్‌ఎల్ మూర్తి, టి నాగరాజు విమర్శించారు. నిరుద్యోగులపై హైదరాబాద్‌లో పోలీసులు లాఠీచార్జి చేయడం హేయమైన చర్య అని తెలిపారు. ఆమె కుటుంబానికి న్యాయం చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై నమోదు చేసిన కేసులను ఎత్తేయాలని కోరారు. నిరుద్యోగులకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని తెలిపారు.

ప్రవళికది ఆత్మహత్య కాదని, ప్రభుత్వ హత్యేనని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ విమర్శించారు. ప్రవళిక కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఆమె కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగుల ఆత్మహత్యలు ఆగాలంటే కెసిఆర్‌ను గద్దెదించాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఆ ఆత్మహత్యలకు కారణమైన సిఎం కెసిఆర్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగులను బిఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలీ ఉల్లా ఖాద్రీ, కె ధర్మేంద్ర విమర్శించారు. సిఎం కెసిఆర్ పాలనంతా ఆత్మహత్యలు, కన్నీటి పర్యంతమేనని తెలిపారు. ప్రవళిక మరణం ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని పేర్కొన్నారు.

ప్రవళిక ఆత్మహత్యకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఎఐడిఎస్ఒ రాష్ట్ర కార్యదర్శి ఎ సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. అవినీతిమయమైన టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలనీ, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని తెలిపారు.